# ముఖ్యమంత్రి చంద్రబాబుకు అరుదైన గౌరవం

## యుఎస్ఐబిసి నుంచి 'ట్రాన్స్‌ఫర్మేటివ్ చీఫ్ మినిస్టర్' అవార్డు

కాలిఫోర్నియా, మే 9 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అమెరికాలో అరుదైన గౌరవం, గుర్తింపు లభించాయి. భారత్–యూఎస్ భాగస్వామ్యానికి రాష్ట్ర స్థాయిలో కృషి చేస్తున్నందుకు గాను 2017 సంవత్సరానికి యునైటెడ్ స్టేట్స్ ఇండియా బిజినెస్ కౌన్సిల్ (USIBC) చంద్రబాబు నాయుడును 'ట్రాన్స్‌ఫర్మేటివ్ చీఫ్ మినిస్టర్'గా ప్రకటించింది. యుఎస్ఐబీసీ రెండవ వార్షిక పశ్చిమ తీర సదస్సు వేదికపై ఈ అవార్డును సిస్కో సంస్థ వరల్డ్ వైడ్ హెడ్ జాన్ చాంబర్స్ చేతుల మీదుగా ముఖ్యమంత్రి అందుకున్నారు. ఈ పురస్కారం తనకు మాత్రమే కాదని, తన రాష్ట్రానికి దక్కిన గౌరవంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇది అమెరికన్ ఇన్వెస్టర్ల నుంచి తన రాష్ట్రానికి ఇస్తున్న మద్ధతుగా భావిస్తున్నానని అన్నారు. తన మిత్రుడు, శ్రేయోభిలాషి జాన్ చాంబర్స్ నుంచి అందుకోవడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని చెప్పారు.

ఇక్కడున్న ప్రతి యూఎస్ పారిశ్రామికవేత్త ఏపీకి వచ్చి ఒక పరిశ్రమను స్థాపించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కోరారు. అనేక సంవత్సరాలుగా భారత్–యూఎస్ మధ్య సత్సంబంధాలు కొనసాగుతున్నాయని, పెట్టుబడులు పెట్టేందుకు భారత్‌లో అపార అవకాశాలు వున్నాయని చెప్పారు. భారత్‌లో, ఏపీలో పెట్టుబడులు ఎలా పెట్టాలన్నది ప్రస్తుతం మీ ముందున్న అంశమని, త్వరితగతిన వచ్చి మీ వ్యాపారాల్ని విస్తరించాల్సిందిగా సూచించారు.

### ద్వైపాక్షిక సమావేశాలతో ముఖ్యమంత్రి బిజీ

యుఎస్ఐబిసి సదస్సులో ముఖ్యమంత్రి వరుస ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. పట్రా కార్ప్ సీఈవో జాన్ ఎస్ సింప్సన్‌తో తొలిగా భేటీ అయ్యారు. విశాఖలో ఇప్పటికే కార్యకలాపాలు కొనసాగిస్తున్న ఈ అమెరికన్ బీపీవో పరిమిత స్థలం కారణంగా విస్తరించలేకపోయామని, విశాఖ బీపీవోలో 1500 మంది ఉద్యోగులు వుండగా, స్థలం సమస్య కారణంగా నయా రాయపూర్‌కు 500 మంది ఉద్యోగులను తరలించినట్లు చెప్పారు. విశాఖలో తగిన కార్యాలయ సముదాయం ఉంటే మరో 500 ఉద్యోగాలు కల్పిస్తామని సింప్సన్ చెప్పగా దీనికి వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి టెక్ మహీంద్ర బిల్డింగ్స్ కేటాయించాలని ఏపీఐఐసీకి నిర్దేశించారు.

### నైపుణ్యం పెంచేందుకు బెల్ కర్వ్ లాబ్స్ సిద్ధం

వీసా కార్డ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అంబాసిడర్ డెమెట్రియస్ మరంటీస్‌తోనూ ముఖ్యమంత్రి చర్చలు జరిపారు. అలాగే ఇంటర్నేషనల్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ కంపెనీ బెల్ కర్వ్ లాబ్స్ ప్రతినిధులతోనూ సమావేశమయ్యారు. సంస్థ కార్యకలాపాలపై ప్రెజెంటేషన్ ఇచ్చిన ఆ సంస్థ ప్రతినిధులు ప్రపంచ వ్యాప్తంగా 40 % నైపుణ్యం కొరవడినట్టుగా గుర్తించినట్టు చెప్పారు. భారత్‌లో ఈ సమస్య అధికంగా వుందని, అమెరికాలో ఇప్పటికే 'వర్క్ రెడీ కమ్యూనిటీస్' కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు, ఏపీలో ఈ అంశంపై పనిచేయడానికి సిద్ధంగా వున్నామని వెల్లడించారు.

మొబిలిటీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ గ్రూప్ సీఎండీ డాక్టర్ రవీంద్ర వర్మతోనూ ముఖ్యమంత్రి భేటీకాగా, వారధులు, రహదారులు, ఓడరేవుల నిర్మాణం తమ ప్రత్యేకతగా వర్మ వివరించారు. రాజధాని అమరావతి నిర్మాణంతో పాటు, అనంతపురం–అమరావతి ఎక్స్‌ప్రెస్ వే, రాయపూర్ – విశాఖ హైవే నిర్మాణాలపై ఆసక్తి కనబరిచారు.

ముఖ్యమంత్రితో ఇండియన్–అమెరికన్ వెంచర్ క్యాపిటలిస్ట్ వినోద్ ఖోస్లా సమావేశమయ్యారు. సిలికాన్ వ్యాలీని ప్రభావితం చేసిన ప్రధానమైన వ్యక్తుల్లో వినోద్ ఖోస్లా కూడా ఒకరు. ఏపీలో స్టార్టప్స్ ప్రోత్సాహానికి అవసరమైన వ్యవస్థను రూపొందించడంలో సహకారం అందించాలని వినోద్ ఖోస్లాను ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలో మరో సిలికాన్ వ్యాలీ ఏర్పాటుకు తోడ్పాటు ఇవ్వాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌కు సహకరించడం తనకు ఆనందదాయకమని వినోద్ ఖోస్లా ముఖ్యమంత్రికి చెప్పారు.

## యుఎస్ఐబిసి సదస్సులో కీలకోపన్యాసం

యుఎస్ఐబిసి సదస్సులో కీలకోపన్యాసం చేసిన ముఖ్యమంత్రి 'సన్ రైజ్ ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్ ఫర్మేషనల్ జర్నీ టువర్డ్స్ ఏ హ్యాపీ స్టేట్'(Sunrise Andhra Pradesh Transformational Journey Towards A Happy State) అనే అంశంపై ప్రధానంగా మాట్లాడారు. సన్ రైజ్ ఆంధ్రప్రదేశ్ సంతోష అంధ్రప్రదేశ్‌గా మారుతున్న పరిణామ క్రమాన్ని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇస్తూ ప్రసంగించి ఆకట్టుకున్నారు. సీఎం కోర్ డాష్ బోర్డును వినియోగించుకుంటున్న తీరును ప్రత్యక్షంగా చూసి యూఎస్ వ్యాపార వర్గాలు ప్రశంసించాయి.

## ‘సాంకేతికత సాయంతో సమర్థ పాలన’

సాంకేతికతను సమర్ధంగా ఉపయోగించుకుని ప్రయాణం సాగిస్తున్నామని ముఖ్యమంత్రి తన ప్రసంగంలో తెలిపారు. ఇక్కడ ఒకేసారి భారత్, అమెరికాకు చెందిన వాణిజ్యవేత్తలను కలుసుకోవడం సంతోషంగా వుందని, తన పాత మిత్రుడు జాన్ ఛాంబర్స్ ఇక్కడే వున్నారని. ఆయన్ని 1998లో మొట్ట

మొదటసారి ఇక్కడే కలిసానని గుర్తు చేశారు. తాము ఎప్పుడు కలుసుకున్నా భారత సామర్థ్యం, బలాల గురించి మాట్లాడుకునే వాళ్లమని చెప్పారు. గతంలో తాను అమెరికాలో 15 రోజుల పర్యటించి మైక్రోసాఫ్ట్ సహా అనేక కంపెనీలను హైదరాబాద్‌లో నెలకొల్పేలా కృషి చేసానని అన్నారు.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో భారత్ బలీయమైన శక్తిగా ఎదిగిందన్న ముఖ్యమంత్రి 7.1 శాతం వృద్ధి రేటుతో ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో ఒకటిగా అవతరించిందని చెప్పారు. భారత్‌లో ఇప్పుడున్న బలమైన నాయకత్వం 15 ఏళ్ల స్పష్టమైన విజన్‌తో ముందుకు వెళ్తోందని, నిర్ణయాలు సమర్థంగా అమలు జరుగుతున్నాయని అన్నారు. స్కిల్ ఇండియా, మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు.

## ‘ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి స్పష్టమైన విజన్’

ఆంధ్రప్రదేశ్ సరికొత్తగా ఏర్పడిన రాష్ట్రమని, ఆరంభంలో కొన్ని కష్టాలు వున్నాయని, అలాగే అనేక అనుకూలతలు వున్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. సుదీర్ఘ తీర ప్రాంతం, అపారమైన సహజ వనరులు, నైపుణ్యం గల మానవ వనరులు ఏపీకి సొంతమన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను 2022 నాటికి దేశంలోని మూడు అగ్రగామి రాష్ట్రాల్లో ఒకటిగా, 2029 కల్లా దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా, 2050 నాటికి అత్యున్నత ప్రమాణాలు గల ప్రపంచ గమ్యస్థానంగా మలచాలని ముందుచూపుతో కృషి చేస్తున్నట్టు వివరించారు.

గత మూడేళ్లుగా రెండంకెల వృద్ధి రేటుతో ముందుకు సాగుతున్నామన్న ముఖ్యమంత్రి 20 ఏళ్ల పాటు 15 నుంచి 20 శాతం వృద్ధి రేటు సుస్థిరంగా వుంటే తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోగలుగుతామన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. భారతదేశానికి ఆంధ్రప్రదేశ్ గ్రోత్ ఇంజిన్‌గా మారిందన్నారు. వ్యాపార సరళీకరణలో మొదటిస్థానంలో వున్నామని, 15 రోజుల్లోనే అన్ని అనుమతులు ఇస్తున్నట్టు వెల్లడించారు. ఐదు అగ్ర దేశాల స్థాయికి చేరుకోవడానికి అహర్నిశలు శ్రమిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ సేవలు, కార్యక్రమాలు, పథకాలు, విభాగాలన్నీ మొత్తం ఆన్‌లైన్ చేసి పారదర్శక పాలన అందిస్తున్నామని చెప్పారు.

## ‘శరవేగంగా మౌలిక సదుపాయాల కల్పన’

మౌలిక సదుపాయాల కల్పనలో వేగంగా పనిచేస్తున్నామన్న ముఖ్యమంత్రి పోర్టులు, ఎయిర్‌పోర్టులలో పురోగతి కనిపిస్తోందని, ఇప్పటికే 6 పోర్టులలో పూర్తిస్థాయి కార్యకలాపాలు సాగుతున్నాయని చెప్పారు. మరో 8 పోర్టులను అభివృద్ధి చేస్తున్నామని, సముద్ర ఆధారిత వాణిజ్యం

పెంపొందిస్తే ఏపీకి తిరుగువుండదని అన్నారు. ప్రస్తుతం వున్న 6 విమానాశ్రయాలకు అదనంగా మరో 6 విమానాశ్రయాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. మూడు ఇండస్ట్రియల్ కారిడార్లు, రెండు కోస్టల్ ఎకనామిక్ జోన్లు రాష్ట్రానికి రానున్నాయని చెప్పారు. విశాఖ–చెన్నయ్, బెంగళూరు–చెన్నయ్, బెంగళూరు–కర్నూలు ఇండిస్ట్రియల్ కారిడార్ల ఏర్పాటుతో రాష్ట్ర పారిశ్రామిక రంగ ముఖచిత్రం మారిపోనుందని అన్నారు.

## ‘విద్యుత్ లోటును అధిగమించాం’

మూడేళ్ల క్రితం 22.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటుతో మొదలైన ఏపీ ప్రయాణం మూడు నెలల వ్యవధిలోనే మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చామని ముఖ్యమంత్రి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పునరుత్పాదక విద్యుత్, ఇంధన సామర్ధ్యం అంశాలలో భారతదేశానికే ఉత్తమ నమూనాగా నిలిచిందని అన్నారు. త్వరలో 4,600 మెగావాట్ల సౌర పవన విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నామని, సౌర విద్యుత్ యూనిట్ రూ. 2 కే అందించగలిగితే భారత్‌కు తిరుగుండదన్నారు. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి రంగంలో అనేక అంతర్జాతీయ సంస్థలు ఏపీతో కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యుత్ రంగంలో ఎన్ని పురస్కారాలు వుంటే అన్ని పురస్కారాలను ఏపీ కైవసం చేసుకుందన్నారు.

## ‘విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రాధాన్యం’

అభివృద్ధికి విద్య ఎంతో అవసరమన్న ముఖ్యమంత్రి విజ్ఞానం ఎక్కడుంటే అభివృద్ధి అక్కడ వుంటుందనేది తన నమ్మకమన్నారు. అందుకనే అప్పట్లో 30 ఇంజినీరింగ్ కళాశాలలు వున్న సంఖ్యను 350 కళాశాలలుగా పెంచామని చెప్పారు. ఇప్పుడు నవ్యాంధ్రప్రదేశ్ కూడా నాలెడ్జ్ హబ్‌గా మారుతోందని చెప్పారు. ఐఐటీ, ఎన్ఐటీ, ఐసర్, నల్సర్, ఎయిమ్స్ వంటి జాతీయస్థాయి అత్యున్నత విద్యా సంస్థలు రాష్ట్రంలో ఏర్పాటయ్యాయని చెప్పారు. ఇంకా పెట్రోలియం, మెరైన్, లాజిస్టిక్ వర్శిటీలు కూడా నెలకొల్పుతున్నామని అన్నారు. అంతర్జాతీయంగా పేరొందిన ప్రైవేటు యూనివర్శిటీలు ఏపీలో కొలువుదీరుతున్నట్టు వెల్లడించారు.

వైద్య రంగంలోనూ ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చామని ముఖ్యమంత్రి అన్నారు. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం వరకు ప్రతి దశలోనూ అవసరమయ్యే వైద్య, ఆరోగ్య సంరక్షణ చర్యలన్నీ తీసుకుంటున్నామని చెప్పారు. ఏపీ త్వరలో ఒక ఫార్మా హబ్‌గా మారనుందని తెలిపిన ముఖ్యమంత్రి ప్రపంచ ప్రఖ్యాత ఫార్మా కంపెనీలు ఇక్కడ వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించాయన్నారు.

రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని మునుపెన్నడూ లేనంతగా పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నామని, భూసార పరిక్షలు జరిపించి, సూక్ష్మ పోషకాలు అందిస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. పంటకుంటలు, రెయిన్ గన్లు, మొబైల్ లిఫ్ట్ ఇరిగేషన్ వంటి వినూత్న పద్ధతుల ద్వారా సాగు రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చామన్నారు. పెద్దఎత్తున వ్యవసాయ యాంత్రీకరణ చేపట్టామని, సేంద్రీయ-ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌ను సంపూర్ణ కరవు రహిత మాగాణంగా మలచాలన్నదే తన లక్ష్యంగా ముఖ్యమంత్రి చెప్పారు. దేశంలోనే తొలిసారి నదుల అనుసంధానం చేశామని, ఈ శతాబ్దంలోనే గొప్ప ప్రాజెక్టుగా, చరిత్రలో నిలిచే పోలవరం ప్రాజెక్టును శరవేగంగా నిర్మిస్తున్నట్టు తెలిపారు.

విశాఖ, చిత్తూరు, నెల్లూరు, అనంతపురం, కర్నూలు జిల్లాలలో ఏరో స్పేస్, డిఫెన్స్ రంగాల అభివృద్ధికి ప్రణాళికలు  రూపొందించామని ముఖ్యమంత్రి చెప్పారు. అత్యధిక ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అవకాశం వున్న టెక్స్‌టైల్స్, అపెరల్ రంగాలను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలో పట్టణీకరణ వేగంగా జరుగుతోంది. విశాఖ, అమరావతి, తిరుపతిలను 3 మెగా సిటీలుగా అభివృద్ధిచేస్తున్నట్టు, ఇవి కాకుండా మరో 14 స్మార్ట్ సిటీలను రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రతిఇంటికి 100 శాతం గ్యాస్, విద్యుత్ కనెక్షన్లను అందిస్తున్నామని చెప్పారు.

రాజధాని కూడా  లేకుండా మొదలైన తమ ప్రయాణంలో సంక్షోభాలనే అవకాశాలుగా మార్చుకుని ముందుకు సాగుతున్నామని, తన పిలుపుతో 33 వేల ఎకరాలను రైతులు భూ సమీకరణ విధానం కింద రాజధాని  నిర్మాణానికి అందించారని ముఖ్యమంత్రి చెప్పారు. అమరావతిలో ప్రధాన నగరంతో పాటు నవ నగరాలను, 27 టౌన్‌షిప్పులను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. తనకున్న అనుభవంతో అమరావతిని ప్రపంచశ్రేణి నగరంగా నిర్మిస్తానని చెప్పారు.

ఇ-ప్రగతి ద్వారా పాలనను 100% కంప్యూటరీకరణ చేస్తున్నామని, మూడవ పారిశ్రామిక విప్లవంలో ఐటీని బాగా ప్రమోట్ చేస్తే, నాలుగవ పారిశ్రామిక విప్లవం రోజుల్లో ఐవోటీని విస్తృతంగా వినియోగిస్తున్నామని చెప్పారు. ప్రతి కుటుంబానికి నెలకు కనీసం రూ. 10 వేల ఆదాయం దక్కేలా సంకల్పించామని, కుటుంబ వికాసానికి 15 అంశాలు, సమాజ వికాసానికి 10 సూత్రాల కార్యక్రమం చేపట్టామన్నారు.

ఇలా రాష్ట్రంలో అనేక రకాలుగా ఎన్నో అవకాశాలు వున్నాయని, వాటిని సరైన సమయంలో సద్వినియోగం చేసుకోవాల్సిందిగా పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి కోరారు. ఏపీలో, భారత్‌లో

సుస్థిర ప్రభుత్వాలు భవిష్యత్‌లోనూ కొనసాగుతాయని, గతంలో పదేళ్లు తాను ముఖ్యమంత్రిగా పనిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తే ఆ తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు పతనావస్థకు తీసుకువెళ్లారని, ఈసారి మాత్రం అలాంటి పరిస్థితులు తలెత్తవని చెప్పారు.

సిలికాన్ వ్యాలీలో తెలుగువాళ్లు చాలామంది వున్నారని, తెలుగువాళ్లు కేవలం ఉద్యోగులుగా మిగిలిపోకుండా ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదగాలన్న తన అభిలాష ఇక్కడ నిజమైందని ముఖ్యమంత్రి అన్నారు. అమెరికాలో వున్న తెలుగువారు ఇక్కడ నివసిస్తున్న ఇతర దేశాలవారి కంటే ముందుండటం ఎంతో సంతోషకరమని చెప్పారు. సదస్సు ముగిసిన అనంతరం జాన్ ఛాంబర్స్ నివాసంలో ప్రముఖులకు ఏర్పాటు చేసిన విందులో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. సిలికాన్ వ్యాలీకి చెందిన అతిరధులు విందుకు తరలివచ్చారు.

## క్లౌడ్ హబ్ చేసేందుకు న్యుటనిక్స్ సాయం

సదస్సుకు ముందు ముఖ్యమంత్రితో న్యుటనిక్స్ సీఈఓ ధీరజ్ పాండే సమావేశమయ్యారు. ఈ సంస్థలో 50 శాతం పైగా ఇంజనీర్లు తెలుగు వారే కావడం విశేషం. అయితే ఏపీని క్లౌడ్ హబ్‌గా రూపొందించడంలో ప్రభుత్వానికి సహకారం అందించేందుకు ధీరజ్ పాండే ఆసక్తి కనబరిచారు. మరో రెండు నెలల్లో దీనిపై స్పష్టమైన రోడ్ మ్యాప్, ప్రాజెక్ట్ రిపోర్టుతో వస్తామని తెలిపారు. క్లౌడ్‌కు సంబంధించిన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించే సామర్థ్యం నుటనిక్స్‌కు వుంది.

ముఖ్యమంత్రి బృందంలో ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి గుట్టుపల్లి సాయిప్రసాద్, ఆర్థిక అభివృద్ధి మండలి కార్యనిర్వాహక అధికారి జాస్తి కృష్ణకిశోర్, సీఆర్‌డీఏ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, ఐటీ ముఖ్య కార్యదర్శి కావేటి విజయానంద్, పరిశ్రమల శాఖ కార్యదర్శి సోల్మన్ ఆరోఖ్యరాజ్ వున్నారు.